అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



రాష్ట్రపతికి గవర్నర్, సిఎంల వీడ్కోలు

5

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 221 ఆదివారం 23 నవంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



# విశ్వ వ్యాప్త ప్రేమకు ప్రతిరూపం సత్యసాయి

## రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

**పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు**

**మానవ సేవే మాధవ సేవ అని బాబా చాటారన్న ముర్ము**

**బాబా బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయన్న సీఎం**

**మానవ సేవలో సత్యసాయి ట్రస్ట్ ఆదర్శనీయమన్న నేతలు**

**ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ కార్యక్రమం ప్రారంభం**



**శ్రీ సత్యసాయి నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** శ్రీ సత్యసాయి బాబా నిరంతరం బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి మార్గాలు అనుసరణీయమని, లోక కల్యాణం కోసమే ఆయన పాటుపడ్డారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో కలిసి ఆమె సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు విమానాశ్రయంలో రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు.మిగతా 2లో...

# ప్రపంచ అభివృద్ధికి మోదీ కొత్త దారి!

**జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు..**



**జీ20 సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం**

**సాంప్రదాయ విజ్ఞానం కోసం 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ' ఏర్పాటుకు సూచన**

**ఆఫ్రికాలో 10 లక్షల మంది శిక్షకుల తయారీకి ప్రత్యేక కార్యక్రమం**

**డ్రగ్స్-టెర్రర్ నెట్‌వర్క్‌పై ఉమ్మడి పోరుకు ప్రపంచ దేశాలకు పిలుపు**

**ఆరోగ్య అత్యవసర సేవల కోసం గ్లోబల్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటుకు ప్రతిపాదన**

జొహాన్నెస్‌బర్గ్ **నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం ప్రారంభమైన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించారు. ప్రారంభ సెషన్‌లో ప్రసంగించిన ఆయన.. ప్రపంచ అభివృద్ధి ప్రమాణాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. సమ్మిళిత, సుస్థిర వృద్ధి లక్ష్యంగా పలు కీలకమైన, వినూత్నమైన నాలుగు కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఆఫ్రికా ఖండం తొలిసారిగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. 'సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి' అనే అంశంపై జరిగిన ఈ సెషన్‌లో మోదీ మాట్లాడుతూ, భారతదేశపు ప్రాచీన నాగరికతా విలువలు, ముఖ్యంగా ఏకాత్మ మానవతావాదం ) ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపగలవని అన్నారు. అనంతరం తన ప్రసంగంలోని ముఖ్యాంశాలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.మిగతా 2లో...



## ఏపీలో మరో 11 కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ**

**వివిధ సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యత**

**పలు అభివృద్ధి, సంక్షేమ సంస్థలకు కొత్త సారథులు**

2లో.

### తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన

## 37 మంది మావోయిస్టులు...

**లొంగిపోయిన వారిలో కీలకనేత ఆజాద్**

**వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు**

**మిగిలిన 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులు**

**లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలు అప్పగించినట్లు తెలిపిన డీజీపీ**



**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై ప్రభుత్వం రూ. 1.41 కోట్ల రివార్డు ప్రకటించింది.మిగతా 2లో...

## పక్కపక్కనే జగన్, కేటీఆర్

**పక్కపక్కనే కూర్చుని ముచ్చటించుకున్న జగన్, కేటీఆర్**

**ఇద్దరు కలిసి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు వైరల్**

**కేటీఆర్ చెబుతుంటే వింటూ కూర్చున్న జగన్**



బెంగళూరు **నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వేదికపై కలుసుకున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించారు. కేటీఆర్ ఏదో చెబుతుండగా జగన్ వేడుకను తిలకిస్తూ విన్నారు.మిగతా 2లో...



## తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో అంతటి చైతన్యవంతులు : రేవంత్ రెడ్డి

**అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**కవులు, కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్న ముఖ్యమంత్రి**

**తెలంగాణ ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని వ్యాఖ్య**

## 5లక్షల కోట్ల భూములకు రెక్కలు

**5వేల కోట్లకే అస్మదీయులకు కట్టబెట్టే కుట్ర**

**ప్రభుత్వ తీరును తప్పుపట్టిన హరీష్ రావు**



హైదరాబాద్, **నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. అజామాబాద్ పారిశ్రామికమిగతా 2లో...

## శ్రీ సత్యసాయి విద్యాసంస్థల క్రమశిక్షణ, విలువలు అమోఘం

**2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్**

**ప్రధాని వల్లే భారత్ గ్లోబల్ లీడర్: సీపీ రాధాకృష్ణన్**






### పంచాయతీ ఎన్నికలకు

## లైన్ క్లియర్..

### రిజర్వేషన్లపై జీవో విడుదల

**గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వ జీవో**

**50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు ఖరారు**

**రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు**

**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల విధివిధానాలను ఖరారు చేస్తూ కీలకమైన జీవోను విడుదల చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకుమిగతా 2లో...

## రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబించేలా..

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు**

**తెలంగాణ పారిశ్రామిక విధానంపై సమగ్ర ప్రకటన**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**



హైదరాబాద్, **నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్,సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సీఎంవో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.మిగతా 2లో...

# విశ్వ వ్యాప్త ప్రేమకు ప్రతిరూపం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. "సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా భాగ్యం. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన మహానుభావుల్లో ఆయన అగ్రగణ్యులు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ జాతి నిర్మాణం కోసం విశేష కృషి చేస్తోంది. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. 1969 నుంచే మహిళా సంక్షేమానికి బాబా ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.




### బాబా బోధనలు ప్రపంచ శాంతికి మార్గం: సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "'లవ్ ఆల్.. సర్వ్ ఆల్' అనేదే బాబా సిద్ధాంతమని, ఆయన ప్రవచించిన పంచ సూత్రాలు పాటిస్తే ప్రపంచం శాంతితో వర్ధిల్లుతుందని అన్నారు. "సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టడానికైనా ఆయన సిద్ధపడ్డారు. ఆయన స్ఫూర్తితో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలిచ్చి ఆ ప్రాజెక్టులను పూర్తి చేశారు" అని గుర్తుచేసుకున్నారు. సత్యసాయి ట్రస్ట్ 140 దేశాల్లో 2 వేలకు పైగా శాఖలతో, 7.50 లక్షల మంది వాలంటీర్లతో సేవలందించడం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం'ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ద

సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# రెండేండ్ల విజయోత్సవాలు ప్రతిబించేలా..

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలన్నారు. 9వ తేదీన రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్ని కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజంటేషన్లు తయారు చేసుకోవాలని సీఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సీఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంతో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాలుపంచుకోవాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు.

# శ్రీ సత్యసాయి విద్యాసంస్థల క్రమశిక్షణ, విలువలు అమోఘం

**2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ : ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్,సీపీ రాధాకృష్ణన్**







**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :**

శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్–1 స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో నేటి పట్టభద్రులు కీలక భాగస్వాములు కానున్నారని ఆయన అన్నారు. శ్రీ సత్యసాయి జయంత్యుత్సవాల్లో గత మూడు రోజులుగా దేశంలోని అత్యున్నత స్థాయి ప్రముఖులు పాల్గొనడం, బాబా ఎంతటి శక్తిమంతులో తెలియజేస్తోందన్నారు.ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ, "శ్రీ సత్యసాయి విద్యాసంస్థల్లో కనిపించే క్రమశిక్షణ, నిబద్ధత మరే యూనివర్శిటీలోనూ కనిపించవు. స్నాతకోత్సవంలో విద్యార్థులందరూ ఎంతో క్రమశిక్షణతో నేలపై కూర్చోవడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇంత పెద్ద ఎత్తున ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడం గొప్ప విషయం. ఎంతమందిని గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దామనేది కాకుండా, ఎంతమందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దామనే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేయడం అభినందనీయం" అని కొనియాడారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ యవనికపై తనదైన ముద్ర వేస్తోందని రాధాకృష్ణన్ అన్నారు. "ఒకప్పుడు ప్రపంచం చెప్పేది భారత్ వినేది, కానీ ఇప్పుడు భారత్ చెప్పేది ప్రపంచం వింటోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇన్నోవేషన్లకు కేంద్రంగా, సుస్థిరాభివృద్ధికి ప్రతిరూపంగా ప్రధాని మోదీ దేశాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. కోవిడ్ టీకాలను మన దేశం కనుగొనడమే కాకుండా, 100కు పైగా దేశాలకు ఉచితంగా అందించిందని గుర్తుచేశారు. ఈ సహాయానికి కృతజ్ఞతగా ఒక దేశాధ్యక్షుడు ప్రధాని మోదీ పాదాలకు నమస్కరించిన సంఘటనను ఆయన ఉదహరించారు. భారతమాత శక్తిమంతమైనదే కాదు, దయ కలిగినదని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. కోవిడ్ టీకాలను వ్యాపారంగా చూడకుండా మానవతా దృక్పథంతో అందించడం వల్లే మోదీ గ్లోబల్ లీడర్‌గా ఎదిగారని స్పష్టం చేశారు.

పట్టాలు అందుకున్న విద్యార్థులే భవిష్యత్ లీడర్లని ఉప రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్ రాజకీయాల్లోకి రావాలని సూచించినప్పుడు విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన చూస్తే, వారిలో నాయకత్వ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. సత్యసాయి బాబా సూత్రాలను, సిద్ధాంతాలను దేశ విదేశాలకు తీసుకెళ్లాల్సిన బ్రాండ్ అంబాసిడర్లు విద్యార్థులేనని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజానికి డ్రగ్స్ అతిపెద్ద సవాలుగా మారిందని, 'నో టూ డ్రగ్స్' అంటూ యువత పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని కోరారు. మంచి ఫలితాలు సాధించాలంటే పరిశోధన (రీసెర్చ్) రంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# పక్కపక్కనే జగన్, కేటీఆర్

**(మొదటి పేజీ తరువాయి)**

ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వారిద్దరు కలిసి బయటి నుంచి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి తొమ్మిదిన్నరేళ్లు బీఆర్ఎస్ అధికారంలో కొనసాగింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి టర్మ్ తెలుగుదేశం, రెండో టర్మ్ వైసీపీ ప్రభుత్వాలు పాలించాయి. ఈ క్రమంలో 2019 నుంచి ఏపీలోని వైసీపీ ప్రభుత్వం, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య సత్సంబంధాలు కొనసాగాయనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ఓటమి పాలయ్యాయి.ఇటీవల కేసీఆర్ పై, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై జగన్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు ఒక వేడుకలో కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ప్రపంచ అభివృద్ధికి మోదీ కొత్త దారి!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రపంచ అభివృద్ధికి సంబంధించి నాలుగు వినూత్నమైన ప్రతిపాదనలను ఆయన ప్రపంచ దేశాల ముందు ఉంచారు. ప్రపంచ అభివృద్ధి పారామీటర్లను పునఃసమీక్షించి, సమ్మిళిత, సుస్థిర వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇదేనని మోదీ పిలుపునిచ్చారు.మొదటి ప్రతిపాదనగా, జీ20 ఆధ్వర్యంలో 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ'ని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. పర్యావరణ అనుకూల, సాంస్కృతిక జీవన విధానాలను పరిరక్షించే సాంప్రదాయ విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీనికి భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాతిపదికగా నిలుస్తుందని తెలిపారు.రెండో కీలక ప్రతిపాదనగా, ఆఫ్రికా అభివృద్ధికి 'జీ20–ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్'ను ప్రధాని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 10 లక్షల మంది సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు.అలాగే, డ్రగ్స్–టెర్రర్ సంబంధాలను ఎదుర్కోవడంపై మరో ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, ఉగ్రవాదానికి నిధులు అందకుండా చేయడానికి జీ20 దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.చివరగా, 'జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్'ను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించేందుకు జీ20 దేశాల వైద్య నిపుణులతో ఈ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

# పంచాయతీ ఎన్నికలకు లైన్ క్లియర్..

**(మొదటి పేజీ తరువాయి)**

అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు చేయనున్నారు. ఈ పద్ధతి ద్వారా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించింది.ఈ జీవోలో గిరిజన గ్రామాలకు సంబంధించి ఒక ప్రత్యేక నిబంధనను చేర్చింది. వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు అన్నీ ఎస్టీలకే రిజర్వ్ చేయబడతాయని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టం పూర్తికావడంతో త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన

# 37 మంది మావోయిస్టులు...

**(మొదటి పేజీ తరువాయి)**

లొంగిపోయిన వారికి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నారని తెలిపారు.

మిగిలిన 34 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు తమ ఆయుధాలను కూడా అప్పగించారని ఆయన అన్నారు.37 మందికి తక్షణ సహాయంగా రూ.25 వేల చొప్పున అందజేశామని, ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపై రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, ఆ మొత్తాన్ని వారికే అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే లొంగిపోయిన తెలంగాణ మావోయిస్టులకు ప్రభుత్వం అందించే పునరావాస ప్యాకేజీని అందజేస్తామని తెలిపారు.మిగిలిన మావోయిస్టులు కూడా త్వరగా లొంగిపోవాలని ఆయన సూచించారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారని, వీరంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని ఆయన అన్నారు.

# 5లక్షల కోట్ల భూములకు రెక్కలు

భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100శాతం నుంచి 200 శాతం అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు 7 రోజుల్లో ఆమోదాలు 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన పక్రియ అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బ్జడెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారని నిలదీసారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే పక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# ఏపీలో మరో 11 కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లు

**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :**

ఆంధ్రప్రదేశ్‌లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఛైర్మన్లను నియమించింది. ఈ మేరకు మొత్తం 11 సంస్థలకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నియమితులైన ఛైర్మన్ల జాబితా**

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్: కల్యాణం శివశ్రీనివాసరావు, ఏపీ స్టేట్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ చైల్డ్ లేబర్: సత్యనారాయణ రాజు ఏపీ అఫిషియల్ లాంగ్వేజ్ కమిషన్: విక్రమ్,ఉర్దూ అకాడమీ: మౌలానా షిబిలీ ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్: రామ్‌ప్రసాద్,పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా): మధుబాబు ,స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: శంకర్‌రెడ్డి

కుర్ని, కరికాలభక్తుల వెల్ఫేర్ కార్పొరేషన్: మిన్నప్ప,స్టేట్ షేక్, షీక్ వెల్ఫేర్ కార్పొరేషన్: ముక్తియార్ భట్రాజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్: వెంకటేశ్వరరాజు, పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: వీరభద్రరావు

# తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో అంతటి చైతన్యవంతులు

**అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :**




తెలంగాణ ప్రజలు చూడటానికి ఎంత అమాయకంగా కనిపిస్తారో, అంతటి చైతన్యవంతులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ప్రముఖ రచయిత అందెశ్రీ సంతాప సభలో ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిచ్చిన స్ఫూర్తితోనే తెలంగాణ కల సాకారమైందని ఆయన అన్నారు.అందెశ్రీ ఎన్నడూ బడికి వెళ్ళకపోయినా 'జయజయహే తెలంగాణ' వంటి అద్భుతమైన గేయాన్ని రచించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అందెశ్రీ పాట లేని సభ ఒక్కటి కూడా జరగలేదని ఆయన అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని విస్మరించే ప్రయత్నం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కవి రాసే పెన్నులపై మన్ను కప్పితే, అవి గన్నులై మొలకెత్తుతాయని, మీ గడీలను కూల్చివేస్తాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై ప్రజలు అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్ని వజ్రాలున్నా కోహినూర్ వజ్రం ప్రత్యేకమైన విధంగానే, కవులు ఎంతమంది ఉన్నా అందెశ్రీ ప్రత్యేకమని రేవంత్ రెడ్డి అన్నారు.

# త్వరలో తాటికొండకు ఎక్స్ ప్రెస్ ఫీడర్ ప్రారంభిస్తాం

## ... రైతు పొలంబాటలో ఎన్పిడిసిఎల్ ఏఈ పి శంకర్

**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** త్వరలో తాటికొండకు (ఎక్స్ ప్రెస్) ఫీడర్ ప్రారంభిస్తామ ని ఎన్పిడిసిఎల్ ఏఈ పగిడిముంతల శంకర్ అన్నారు.

స్టేషన్ ఘనపూర్ టౌన్ పరిధిలోని తాటికొండగ్రామంలో శనివారం ఏఈ ఆపరేషన్ ఘనపూర్ టౌన్ పగిడిముం తల శంకర్ ఆధ్వర్యంలో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ భూముల్లో రైతులకు విద్యుత్ సరఫరాలోఉన్న సమస్యలనుతెలుసుకొని యుద్ధప్రాతి పదికన పనులు నిర్వహించడం జరిగింది.ఈసందర్భం గా ఏఈ శంకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం ఒకగ్రామంలో వ్యవసాయ క్షేత్రాల్లో రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించి రైతు ల సమస్యలు సాధ్యమైనంత వరకూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా




తాటికొండలో ఇప్పటివరకు వదులుగా ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి 11 కేవి లైన్లో 40, ఎల్టీ లైన్లో 12 మధ్యస్థ స్థంబాలను నాటించి ప్రమాదాలను నివారిం చామని,ఇంకా 30స్థంబాలు నాటించే కార్యక్రమం జరు గుతుందని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో బ్రేక్డౌన్ల సత్వర పరిష్కారం కోసం11కేవి లైన్లో పన్నెండు,సింగిల్ పేస్ నియంత్రికల వద్ద మూడు (ఆన్ఆఫ్ సిస్టమ్) ఏబి స్విచ్ లను భిగించామని తెలిపారు. అంతేకాకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధం లేకుండా, గ్రామంలోని నివాస, వాణిజ్య సముదాయాలకు ప్రత్యే కంగా ఎక్స్ ప్రెస్ ఫీడర్ ప్రారంభించడానికి సామాగ్రి సిద్ధంగా ఉందని త్వరలో గుత్తేదారుకు పనులు అప్ప జెప్పి ఎన్నో ఏళు ్లగా ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తామని అన్నారు. వినియోగదారు లు బకాయిలు లేకుండా విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లించాలని,భద్రతా సూత్రాలను పాటిస్తూ ప్రమాదాల ను నివారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాటికొండ లైన్మెన్ దేవి సురేందర్ రెడ్డి, అన్మ్యాండ్ వర్కర్ యార రాజేందర్, రైతులు నర్రెంగల చేరాలు, నాగరాజు, సాంబరాజు, పుట్ట ఉప్పలయ్య, ఉబ్బని జన్నయ్య, పండుగ అశోక్, నూనెముంతల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి జిల్లా స్థాయికి ఎంపికైన తాటికొండ విద్యార్థులు




**స్టేషన్ ఘన్ పూర్/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో శుక్రవారం జరిగిన చెకుముకి స్టేషన్ ఘన్పూర్ మండల స్థాయి సైన్స్ పోటీలలో మండలంలోని తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి ఈనెల28న జనగామజిల్లాలో నిర్వహించే జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తాటికొండ పాఠశాల విద్యార్థులు నారబోయిన శ్రీమన్, బూరుగు రాజు, లావుద్య గణేష్ లు ప్రభుత్వ పాఠశాలల విభా గం నుండి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల కు జరిగిన పోటీలో పాల్గొని ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యరని తెలిపారు.ఈ సందర్భం గా ఎంపికైన విద్యార్థులను, పాఠాలు బోధించిన సైన్స్, గణిత ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు అభి నందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు రుద్ర, రంజిత్ కుమార్, డి శ్రీనివాస్, రవీందర్, యం శ్రీనివాస్, అనసూయ, కృపమ్మ, సలావుద్దీన్, సోమేశ్వ రి, పిడి గిరెడ్డి ప్రమోద్ రెడ్డి, జగదీశ్వర్, ఐలోని రవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులం నిర్మాణం

## -డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క





**వైరా/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** వైరాలో యంగ్ ఇండియా సమీకృత గురుకులం, ఏడు 33/11 కేవీ సబ్స్టేషన్లు, రోడ్డు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. 20 ఎకరాల్లో 200 కోట్లతో గురుకులం నిర్మిస్తున్నామని, ఇది విద్యారంగంలో గేమ్చేంజర్గా నిలుస్తుందని తెలిపారు.విద్యార్థుల పోషకాహారం దృష్ట్యా 40% డైట్ చార్జీలు, 200% కాస్మోటిక్స్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. కామన్ డైట్ మెనూ అమలులో ఉన్నదని వివరించారు.మహిళల కోసం కోటి చీరల పంపిణీ ప్రారంభించామని, ఇప్పటి వరకు 27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించామని చెప్పారు. 52,019 కుటుంబాలకు



ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం 36 కోట్లు భరించిందని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు భారీగా ఉపయోగపడుతోందన్నారు. వైరాలో 100 పడకల ఆసుపత్రి, రిజర్వాయర్ కాలువల లైనింగ్, ఏటీసీ మంజూరు పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. గిరిజన రైతుల కోసం 5 వేల బోర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్పీడీసీఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డి వైరా పరిధిలో 18.46 కోట్లతో ఏడు సబ్స్టేషన్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి యంగ్ ఇండియా గురుకులాలు అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం అవుతున్నాయని, పనులు నాణ్యతతో పూర్తి చేస్తామని తెలిపారు.ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ వైరా అభివృద్ధికి రెండు ఏళ్లలో 500 కోట్లు మంజూరు చేశారని తెలిపారు.తరువాత మహిళలకు ఇందిరమ్మ చీరలు, 1,456 సంఘాలకు 153.60 కోట్ల బ్యాంకు లింకేజ్ చెక్కులు అందజేశారు.

# జెఎసి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

## ఈనెల 26న సదస్సు, బహుమతుల ప్రదానోత్సవం



**భీమదేవరపల్లి/నవంబర్22 (జర్నలిస్ట్ వార్త):** హుస్నాబాద్ నియోజకవర్గ జెఎసి ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ఎస్ఆర్ టి కళాశాలలో భారత రాజ్యాంగం విశిష్టత అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 26న జెఎసి చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్ దేగల సారయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు బేరే యాదగిరి, గాండ్ల పద్మ తెలిపారు. యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డా.నిమ్మ సుదర్శన్, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హెచ్. వాగిషన్ సదస్సుకు హాజరుకానున్నట్లు తెలిపారు. వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులచే బహుమతి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎదులాపురం మొగిలి, జెఎసి నాయకులు దస్తరి ఉమామహేశ్వర్, చుంచు ఐలయ్య, తాళ్లపల్లి ఆశీర్వాదం, సింధు, కుమారస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ చేయూత



**రాయపర్తి/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన నిరుపేద మంద ఉప్పలమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం బాధిత కుటుంబాన్ని రాయపర్తి పిఎసిఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి పరామర్శించారు.అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పంపించిన 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాము మనోహర్, సదా శ్రీనివాస్, పోలేపక బిక్షపతి, పోలేపక మారయ్య, గిద్దె యాకయ్య, పోలేపక రాజు, మంద నర్సయ్య, కందుకూరి వెంకన్న, కందుకూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన

## కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట/నవంబర్22(జర్నలిస్ట్ వార్త):**

మృతుల కుటుంబాలను కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వర్ధన్నపేట మండలం కట్రియాల గ్రామానికి చెందిన చెంగల కుమార్, రాజు తండ్రి చెంగల రాములు గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం,మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని మనోధైర్యం కల్పించారు. అనంతరం ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన కాజీపేట దర్గా సొసైటీ వైస్ చైర్మన్ మాదాసి బాబు సోదరుడు మాదాసి వెంకట స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వార్త తెలుసుకున్న కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా వరంగల్ ఉర్సు కరిమాబాద్ కు చెందిన మంద కనకయ్య భార్య మంద పుష్ప లీల ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఈగ మల్లేశం పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రంగశాయిపేట కు చెందిన రాపాక ఉదయమ్మ అనారోగ్యం తో మృతి చెందిన వార్త తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పరామర్శించారు.

ఈ కార్యక్రమం లో వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ కక్కే సారయ్య, కరిమిళ్ల సంపత్ రావు, బొమ్మగాని శ్యామ్ గౌడ్, తిరుపతి రెడ్డి, సమ్మయ్య, ఇస్సంపల్లి బాబు,సుధీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఐ-బొమ్మ రవి కేసు దర్యాప్తు చేస్తున్నసైబర్ క్రైమ్ డీసీపీ కవిత వరంగల్‌కు బదిలీ



**హైదరాబాద్,నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** తెలంగాణ రాష్ట్ర హోంశాఖ పోలీసు వ్యవస్థలో భారీగా బదిలీలు చేపట్టింది. తొమ్మిది మంది నాన్-కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా ఐ-బొమ్మ రవి కేసును దర్యాప్తు చేస్తున్న డీసీపీ దారా కవితను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. ఐ-బొమ్మ రవి కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే కవితను బదిలీ చేయడం గమనార్హం. హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగంలో డీసీపీగా ఉంటూ ఆమె పలు కీలక కేసులను దర్యాప్తు చేశారు.కవిత స్థానంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా అరవింద్ బాబును నియమించారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న వై.వీ.ఎస్. సుచేంద్రను హైదరాబాద్ ఎస్బీ డీసీపీగా నియమించారు.

పెద్దపల్లి డీసీపీ పీ. కరుణాకర్‌ను ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా, సైబరాబాద్ ఎస్బీ డీసీపీ బి. సాయిశ్రీని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎన్. శివరాంను ఏసీబీ ఎస్పీగా, ట్రాన్స్‌కో ఎస్పీగా పని చేస్తున్న జగదీశ్వర్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగంలో కొత్త బాధ్యతలు అప్పగించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న రవీంద్రరెడ్డిని గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్‌గా ఉన్న అశోక్ కుమార్‌ని సీఐడీ ఎస్పీగా బదిలీ చేశారు.

# కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికిన కామ్రేడ్ భూక్య బావ్ సింగ్ కు విప్లవ జోహార్లు.



**బయ్యారం/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** కడవరకు కమ్యూనిస్టుగా బ్రతికిన కామ్రేడ్ భూక్య బావ్ సింగ్ విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ యాకన్న తెలిపారు. చొక్లతండా గ్రామ పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ భూక్య బావ్ సింగ్ సంతాప సభ పార్టీ మండల నాయకులు కామ్రేడ్ రామచంద్రుల మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతాప సభలో ముఖ్య వక్తగా హాజరైన కామ్రేడ్ యాకన్న మాట్లాడుతూ తన చిన్నతనం నుండి తన కుటుంబం పూర్తిగా కామ్రేడ్ దొరన్న, ఎర్రమల ఎర్రన్నలతో పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో నిస్వార్థంగా పాల్గొన్నారని, తన తల్లిదండ్రుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, బూర్జువా పార్టీలలో చేరకుండా తన చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలో నిలబడ్డాడని, తన అమరత్వం పార్టీకి, ప్రజలకు తీరని లోటు అని వారు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పోడు భూములకు పట్టాల కోసం నిర్వహించిన పోరాటాలలో తను భాగస్వామ్యం అయ్యాడని, అటువంటి నికార్సైన కార్యకర్త లేకపోవడం తీరని నష్టమని, వారి ఆశయ సాధనలో పయనించడమే వారికి ఇచ్చే ఘనమైన నివాళి అని వారు తెలిపారు. కామ్రేడ్ బావ్ సింకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి బిక్షం, చింతా వెంకన్న, తోకల వెంకన్న, నేతకాని రాకేష్, దొడ్డి తిరుమలేష్,వీరబోయిన ఐలయ్య,రాందాస్,గుడిబోయిన రమేష్, వల్లాల బిక్షం, వల్లాల మధు, బానోత్ భక్ష, శివ, బానోత్ బాలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన సెయింట్ మేరీస్ విద్యార్థులు



**రాయపర్తి/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్,శివ,మాధవ్ లు ఇటీవల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి కి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శిబ్ పాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం





**తల్లాడ/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** భక్తి శ్రద్ధలతో తల్లాడలో అయ్యప్ప స్వాముల పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. బొడ్డు శ్రీను 18వ పడి సందర్భంగా, తనుగుల మణికంఠ శర్మ గురుస్వామి సన్నిధానంలో కోట మైసమ్మ తల్లి ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకకు భక్తుల రద్దీగా తరలివచ్చారు. స్వామియే శరణం అయ్యప్ప స్వామి పాదం అయ్యప్ప పాదం" అంటూ ఆలపించిన అయ్యప్ప భక్తుల నామస్మరణతో తల్లాడ వీధులు మారుమోగాయి. పూజా కార్యక్రమాలు పూర్తయ్యాక స్వాములకు అల్పాహారం, తేనేటి విందు, తీర్థ ప్రసాదాల విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు పెరిక నాగేశ్వరరావు, కొమ్మినేని రామయ్య, ఈలప్రోలు లాలయ్య, బొడ్డు మల్లయ్య, శ్రీకాంతు తదితరులు పాల్గొన్నారు. తరువాత బొడ్డు శ్రీను ని అయ్యప్ప భక్తులు ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు.

## విద్యుత్ ఏఈ గా శ్రీధర్ బాధ్యతలు స్వీకరణ



**రాయపర్తి/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి విద్యుత్ ఏఈ గా కుంట శ్రీధర్ శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈ రవలి సెలవులపై వెళ్ళగా శ్రీధర్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ను అధికారులు,కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగెం ఏఈ అశ్విన్,సబ్ ఇంజనీర్ తాజుద్దీన్, విక్రమ్, ఎస్ ఎల్ ఐ బి రాజయ్య, ఎల్ఐ కిషన్, లైన్ మెన్ వెంకన్న, ప్రభాకర్ రవీందర్, భీమ, ప్రవీణ్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకం

### సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి


### ఆర్ఎస్‌పీ నాయకుడు వాళ్లందాస్ కుమార్



**వర్ధన్నపేట/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ ముమ్మాటికీ నకిలీ నాటకమని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లందాస్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థల కోసం, సామ్రాజ్యవాద శక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం పౌరులపై యుద్ధం ప్రకటించిందని విమర్శించారు. మధ్యభారత ఖనిజాలను చేజిక్కించుకునేందుకు మావోయిస్టుల పేరుతో ఆపరేషన్లు నడిపిస్తూ రక్తపాతం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులను అడవుల నుంచి వెలిబుచ్చేందుకు కుట్రల వెనుకాలే ఈ బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రజలు, మేధావులు, హక్కుల సంఘాలు ఆపరేషన్ 'కగార్'ను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ మోడీ%–%అమిత్‌షాలు కార్పొరేట్లకు ఏజెంట్లలా వ్యవహరిస్తున్నారని అన్నారు. మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని పౌర సమాజం కోరుతుంటే దానికి చెవిటిచెయ్యి పట్టి మరీ రక్తపుటేరులు పారిస్తున్నారని విమర్శించారు. మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సీటింగ్ జడ్జితో న్యాయ విచారణ తప్పనిసరిగా జరపాలని వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ చీరలు,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి.

### -ఎమ్మెల్యే కోరం కనకయ్య.



**బయ్యారం/నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీని కార్యక్రమం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మండల తహశీల్దార్ నాగరాజు,ఎస్ఐ మైబుబి,వెలుగు ఏపిఎం తిరుమల్ సింగ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్, పలువురు,ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్బంగా డ్వాక్రా సంఘాల మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించేందుకు ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని అన్నారు. ప్రభుత్వ పథకాల్లో భాగంగా మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు,500 లకే గ్యాస్ సిలిండర్,ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యమే కల్పించామని, చీరల విషయంలో ఎవరూ బాధ పడాల్సిన అవసరం లేదనీ ఇది మన ఆత్మగౌరవం ప్రతి ఆడబిడ్డకు చీర అందుతుందన్నారు. మండలంలో అనారోగ్య కారణాలతో ఉన్నవారికి ప్రభుత్వం నుండి 29 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ మంగీలాల్,లక్ష్మి, బాబా,చెరుకుపల్లి నర్సయ్య,ఉషోదయ మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న,వెలుగు సీఈఓ లు వీరారెడ్డి,అలీ,వర్షిత,డ్వాక్రా గ్రూపు మహిళా సంఘం వివో నేతలు లక్ష్మీ,సునిత,తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీలు మూసుకుపోయి మురుగు నిల్వ

### -పారిశుద్ధ్య లోపాలతో సత్తుపల్లి ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో





**సత్తుపల్లి/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా శిథిలమైపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీలు మూసుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండిపోవడం, దుర్వాసన విపరీతంగా వ్యాపించడం వంటి సమస్యలపై స్పందన లేకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి టౌన్ అధ్యక్షులు బాణోత్ విజయ్ ఆధ్వర్యంలోని బీజేపీ బృందం కృషి బైపాస్ రోడ్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితులను శనివారం పరిశీలించింది. పరిశీలనలో భాగంగా స్థానికంగా పెద్ద ఎత్తున షిల్ట్ పేరుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండిపోవడం వల్ల వాతావరణం అంతా దుర్గంధం కమ్ముకుపోయిందని గుర్తించారు. కొన్ని చోట్ల డ్రైనేజీ సైడ్ వాల్లు కూలిపోవడంతో మురుగు పారుదల పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. డ్రైనేజీకి ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు విస్తరించి చిన్నచిన్న అడవిలా మారిపోయిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానికులు మాట్లాడుతూ కూలిన డ్రెయిన్ల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ మున్సిపాలిటీ అధికారులు స్పందించకపోవడం ఆందోళనకరమని వాపోయారు. పారిశుద్ధ్య పనులు నిర్లక్ష్యం చెంది ఉండడంతో దోమల పెరుగుదల, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు తెలిపారు.
ఈ నేపథ్యంలో వెంటనే పేరుకుపోయిన షిల్ట్‌ను తొలగించి మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని, దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాణోత్ విజయ్ సహా భాజాపా నాయకులు మున్సిపాలిటీకి విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రజలు అనారోగ్యం పాలవకుండా అధికారులు తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భాజాపా జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, జిల్లా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, మండల అధ్యక్షులు సాలి శివ, జిల్లా కార్యదర్శి పాలా నాగ సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు రహమతుల్లా, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మందా శివ, కార్తీక్ యాదవ్, బట్టి శివ సాయి యాదవ్, చీకటి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీ అయ్యప్ప మహా పడిపూజ





**భీమదేవరపల్లి/నవంబర్22 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని వెంకట సాయి గార్డెన్ లో పెద్దినాగలక్ష్మి సూర్య ప్రకాశం కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ వేడుకలలో సుమారు మూడు వందల మంది అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు పడిపూజలో పాల్గొన్నారు. మహా అద్భుతంగా పడిపూజ నిర్వహించి పడి వెలిగించిన అనంతరం స్వాములకు బిక్ష పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దినాగలక్ష్మి సూర్య ప్రకాశం వారి కుటుంబ సభ్యులను దీవించారు.

# పిల్లల మేధో వికాసానికి దన్నుగా

### - ఘనంగా ఈసిసిఈ డే



**నర్సంపేట/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని నర్సంపేట%–%4 అంగన్వాడీ కేంద్రంలో ఈసిసిఈ డేను పొంగిపొర్లే ఉత్సాహంతో నిర్వహించారు. స్థానిక అంగన్వాడీ టీచర్ నల్లా భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించారు.
ఈ సందర్భంగా నల్లా భారతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆటపాటలు, కథలు, నేర్పు కార్యకలాపాలతో పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నామన్నారు. పిల్లల బుద్ధి వికాసం, సామాజిక ప్రవర్తన, భావోద్వేగాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకమని తెలిపారు. అంగన్వాడీ సేవలను తల్లిదండ్రులు మరింత సద్వినియోగం చేసుకుని పిల్లలు భవిష్యత్తులో మెరుగైన స్థాయికి చేరేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గౌసియా, ఆయా సునీత తో పాటు ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు, శ్రీకళ, కవిత, శ్రీలత, అనూష, స్పందన, మానస, సుష్మిత, ఆసిఫా, సాజియా తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పిల్లల ఆటపాటలు, కార్యకలాపాలు మరింత రంజింపజేశాయి.

## టి యు డబ్ల్యు జే-ఐ జే యు జిల్లా కమిటీలో కొత్త బాధ్యతలు



**ఖమ్మంబ్యూరో /నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం టి యు డబ్ల్యు జే%–%ఐ జే యు జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం నగరంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా స్థాయి నియామకాలు చేపట్టారు. కల్లూరు మండలం ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్ ధర్నాస్ బాలరాజును జిల్లా సహాయ కార్యదర్శిగా కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. అలాగే జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీకి జిల్లా సభ్యునిగా నియమించింది. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు పూలమొక్క అందించి బాలరాజును అభినందించారు. మీడియా వర్గాల అభ్యున్నతికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కమిటీ మరింత చురుగ్గా పనిచేస్తుందని నాయకులు తెలిపారు.

## వందేమాతరం గేయం 150 ఏళ్ల సందర్భంగా సత్తుపల్లిలో దేశభక్తి జ్యోతి




**సత్తుపల్లి/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సత్తుపల్లి మండల పెద్దపాకలగూడెం యుపిఎస్ పాఠశాలలో విద్యార్థులు పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించి దేశభక్తి స్ఫూర్తిని ప్రతిధ్వనింపజేశారు మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ అధ్యక్షతన మండల ఉపాధ్యక్షులు ఎస్కే సుభాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా భాస్కర్ వందేమాతరం జిల్లా కో కన్వీనర్ పాలనాగ సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు వక్తలు మాట్లాడుతూ వందేమాతరం గేయం భారత స్వాతంత్ర్య సమరానికి ప్రేరణగా నిలిచిందని భారత ప్రజలను ఏకం చేసిన మహాగేయమని పేర్కొన్నారు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పూర్తి వందేమాతరం గేయాన్ని పాడకుండా గత పాలకులు నిరోధించగా నరేంద్ర మోదీ ప్రభుత్వంలో 150 ఏళ్ల సందర్బంగా పూర్తి గేయాన్ని దేశవ్యాప్తంగా పాడేలా అధికారికంగా సూచనలు జారీ చేశారని తెలిపారు నేటి యువతరం పూర్తి వందేమాతరం గేయం తెలుసుకుని గౌరవంగా ఆలపించాలని పాఠశాలల్లో విద్యార్థులు పూర్తిగా పాడేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్ ఖమ్మం జిల్లా కౌన్సిల్ సభ్యులు రహమతుల్లా సత్తుపల్లి పట్టణ అధ్యక్షులు బాణావత్ విజయ్ మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్ జిల్లా నాయకులు చీకటి వసంతరావు పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివయాదవ్ పట్టణ కార్యదర్శి కార్తిక్ యాదవ్ సాయి కార్యకర్తలు నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# దశదిన కార్యక్రమానికి 50 కిలోల బియ్యం అందజేత

## సేవాస్ఫూర్తి చాటుకున్న ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ భైరపాక మహేష్

## అభినందించిన గ్రామస్తులు




**ఐనవోలు/గర్మిళ్లపల్లి, నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామంలోని దర్శనాల వెంకటయ్య (70) అనారోగ్యంతో 13వ తేదీన కన్నుమూయడంతో గ్రామం విషాద ఛాయల్లో మునిగిపోయింది. కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోయి ఉన్న సమయంలో వారిని ఆదుకునే ప్రయత్నం స్థానికంగా పలువురు చేసినప్పటికీ%ా% ప్రత్యేకంగా ముందుకొచ్చి సహాయహస్తం చాచిన వ్యక్తి ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ భైరపాక మహేష్. వెంకటయ్య దశదిన కార్యక్రమం నిర్వహిస్తున్న వారి కుటుంబాన్ని స్వయంగా కలిసి పరామర్శించిన మహేష్, కష్టకాలంలో తమవంతు తోడ్పాటుగా 50 కిలోల బియ్యం అందజేశారు. బాధలో ఉన్న కుటుంబానికి ఈ సాయం ఎంతో తోడ్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ "అవసరమైన చోట ఎవరు ఉన్నా వారి కోసం అండగా నిలబడే మంచి మనసున్న వ్యక్తి మహేష్. ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. ఈరోజు కూడా అదే చూపించారు" అని ప్రశంసలు కురిపించారు. వెంకటయ్యతో గ్రామ ప్రజలకు మంచి అనుబంధం ఉండేదని, ఆయన సేవాభావం మర్చిపోలేనిదని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మహేష్, స్థానికులు ఆకాంక్షించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి, భవిష్యత్తులో ఏ సహాయం అవసరమైనా తమవంతు చేయడానికి సిద్ధంగా ఉన్నామని భైరపాక మహేష్ హామీ ఇచ్చారు.

# గండుగులపల్లి కాంగ్రెస్ నేతలతో మంత్రి తుమ్మల భేటీ



**సత్తుపల్లి/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**దమ్మపేట మండలం గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు మండలాల కాంగ్రెస్ నాయకుల బృందం మంత్రి తుమ్మలను కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు తెలియజేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న రహదారి విస్తరణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న పలు పనులపై మంత్రి తుమ్మలకు సమాచారాన్ని అందించారు. పార్టీ బలాన్ని గ్రామాగ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్న మంత్రి తుమ్మల, రానున్న పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందేలా ప్రతి కార్యకర్త కట్టుదిట్టంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజల్లో పార్టీపై నమ్మకం పెరిగిందని, కార్యకర్తలు ఒకే తాటిపై కదిలితే విజయం ఖాయమని మంత్రి తుమ్మల విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

# వైరాలో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి శంకుస్థాపన






**వైరా/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
వైరా మున్సిపాలిటీ పరిధిలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. అనంతరం నియోజకవర్గంలో పలువురు అభివృద్ధి%-%సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సభలో మాట్లాడిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి "వైరా నియోజకవర్గంతో నాకు అభినాభావ సంబంధం ఉంది. నా రాజకీయ పయనం ఇదే నేలను తాకింది. రైతుల కోసం వైరా స్టేషన్ మెట్లు ఎక్కిన తొలి అడుగు కూడా ఇక్కడి నుంచే మొదలైంది" అని గుర్తుచేసుకున్నారు."నేను ఎక్కడున్నా వైరా ప్రజల అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తాను. ఇందిరమ్మ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి హక్కుదారునికి సంక్షేమాన్ని అందించేందుకు కట్టుబడి పనిచేస్తోంది" అని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ మాట్లాడుతూ "మహిళల ఆర్థిక బలోపేతం మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి మహిళను స్వావలంభిగా చేయడంలో ప్రభుత్వం ముందుండి నడుస్తోంది" అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు."18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం భారీ స్థాయిలో పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఒక్క మహిళ కూడా మిగలకుండా, ఇంటికే చీర చేరేలా చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు.

# రాష్ట్రపతికి గవర్నర్, సిఎంల వీడ్కోలు

## రేవంత్‌తో మధ్యప్రదేశ్ సిఎం యాదవ్ భేటీ





హైదరాబాద్,**నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** హైదరాబాద్‌లో రాష్ట్రపతి దరౌపది ముర్ము పర్యటన ముగిసింది. ఒకరోజు పర్యటన కోసం వచ్చిన ఆమె శనివారం మధ్యాహ్నాం ఇక్కడి నుంచి పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్ రెడ్డిలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సిఎం ము÷-మకు జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌ను మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ కలుసుకున్నారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లు తెలిపారు. యాదవ్‌ను సిఎం సాదరంగా ఆహ్వానించారు.

-------------

# హైదరాబాద్‌లో నకిలీ లేడీ ఖాకీని పట్టివేత

## పోలీస్ డ్రెస్‌లో ఏకంగా విఐపి డ్యూటీ

హైదరాబాద్, **నవంబర్ 22(జర్నలిస్ట్ వార్త) :** హైదరాబాద్‌లో నకిలీ ఖాకీ వ్యవహారం వెలుగుచూసింది. జీడిమెట్ల పోలీసు పరిధిలో నకిలీ లేడీ కానిస్టేబుల్‌గా వ్యవహరించిన ఉమాభారతి అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కానిస్టేబుల్ పోస్టుకి సెలెక్ట్ కాలేకపోయినా, తాను పోలీసు సిబ్బందిలోనే పనిచేస్తున్నట్లు చాటుకునేలా ఖాకీ డ్రెస్ కొనుగోలు చేసి, పలు వీఐపీ కార్యక్రమాలకు బందోబస్తు డ్యూటీలు చేసిన విషయం బయటపడింది. తెలంగాణ పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలకు ప్రిపేర్ అవుతూ, పోలీసులలో పనిచేయాలనే కోరికతో ఉమాభారతి ముందుగా డ్రెస్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాదులో జరిగిన కీలక వీఐపీ కార్యక్రమాల్లో.. సచివాలయంలో జరిగిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఖైరతాబాద్ గణెశిష్ ఉత్సవాల ఊరేగింపు వంటి ఈవెంట్లలో బందోబస్తుల పేరుతో తిరిగినట్లు వెల్లడైంది. సైబరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా వెళ్లి, అక్కడి క్యాంటీన్‌లో గడిపి వెళ్లిపోయిన విషయం విచారణలో బయటపడింది. అంతేకాకుండా పలు కాలేజీల్లోకి వెళ్లి 'సైబర్ క్రైమ్ అవేర్‌నెస్' పేరుతో లెక్చర్లు ఇచ్చిందని కూడా పోలీసులు గుర్తించారు. ఒక దశలో ఉమాభారతి ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెను ప్రశ్నించడంతో మొత్తం నకిలీ ఖాకీ డ్రామా బట్టబయలైంది. అసలు పోలీసు ఉద్యోగం లేకపోయినా, అధికారులు, సిబ్బంది తెలియకుండా వీఐపీ డ్యూటీలను కూడా ఎలా చేసిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తల్లాడలో సర్పంచ్ రేసు వేడెక్కింది

## -బరిలోకి కాంగ్రెస్ నాయకుడు దగ్గుల నాగిరెడ్డి



**తల్లాడ/నవంబర్ 22 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బరిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, నీలాద్రి ఆలయ డైరెక్టర్ దగ్గుల నాగిరెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారు. సర్పంచ్ స్థానం జనరల్‌గా కేటాయించడంతో ఆయనకు పోటీ అవకాశం లభించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వార్డు సభ్యుడిగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, ప్రస్తుతం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న నాగిరెడ్డి స్థానికంగా అందరికీ సుపరిచితుడే. నీలాద్రి దేవాలయ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజల్లో మంచి పేరుమోసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న ఆయన సర్పంచ్ పోటీపై ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గెలుపు కోసం తల్లాడలో భారీ ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన నాయకుడు నాగిరెడ్డి. పెద్దఎత్తున ప్రజలను, కార్యకర్తలను సమీకరించి పార్టీకి బలం చేకూర్చారు. ఈ సేవలను గుర్తించిన ఎమ్మెల్యే దంపతులు ఆయనపై నమ్మకం ఉంచి నీలాద్రి ఆలయ డైరెక్టర్ పదవి అప్పగించినట్టు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.తల్లాడ పంచాయతీలో ప్రభావం, ప్రజాదరణ రెండూ ఉన్న నాగిరెడ్డి సర్పంచ్ బరిలో దిగితే రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. అధికారికంగా ఆయన ఎప్పుడు అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తారు అన్నది స్థానికంగా చర్చనీయాంశమైంది.

# పండుగ వాతావరణంలో పండు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ నవంబర్ 22 జర్నలిస్ట్ వార్త**
హైదరాబాద్ నగరంలో శనివారం చిన్నారి పండు పుట్టినరోజు వేడుకలు పండుగను తలపించేలా అంగరంగ వైభవంగా జరిగాయి కుటుంబ సభ్యులు%-%బంధుమిత్రులతో సందడిగా సాగిన ఈ వేడుకలో చిన్నారి చేతులతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచిపెట్టారు జన్మదిన వేడుకలకు తరలివచ్చిన వారు పండుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ జీవితంలో ఎల్లప్పుడూ ఆనందం వెల్లివిరియాలని దీవించారు ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు గణేష్ మాట్లాడుతూ మా చిన్న కూతురు పండు పుట్టినరోజు సందర్భంగా విచ్చేసి ఆశీస్సులు అందించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు అనంతరం కుటుంబ సభ్యులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించగా అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు



